# చేమగడ్డ

తెలంగాణలో చేమగడ్డ పంట రంగారెడ్డి జిల్లాలో సాగు చేయబడుతుంది.

**వాతావరణం:** ఇది ఉష్ణ మండల పంట, ఈ పంటకి ఎప్పుడూ తేమ భూమిలో అధికంగా ఉండాలి.

**నేలలు - నేల తయారీ:** నీటి వసతి కలిగి మరియు నీరు బయటికి పోవు సదుపాయం గల నేలలు అనుకూలం. వేసవిలో భూమిని 30-40 సెం.మీ. లోతుగా దున్నాలి. తొలకరి వర్షాలకు 2-3 సార్లు గొర్రుతో మెత్తగా దుక్కి దున్ని చదును చేయాలి. ఆఖరి దుక్కిలో ఎకరాకు 8-10 టన్నుల బాగా చివికిన పశువుల ఎరువు మరియు 24 కిలోల భాస్వరం ఇచ్చు ఎరువును సూపర్ ఫాస్ఫేట్ రూపంలో వేసి కలియదున్నాలి.

**నాటే సమయం:** జూన్-జులై, ఫిబ్రవరి-ఏప్రిల్ నెలలు నాటడానికి అనుకూలం. తెలంగాణ ప్రాంతంలో ఫిబ్రవరి నుండి ఏప్రిల్ వరకు నాటడానికి అనుకూలం.

**రకాలు:**

| రకం | కాలపరిమితి (నెలల్లో) | దిగుబడి (ట/ఎకరాకు) | నాటేదూరం (సెం.మీ.) |
|---|---|---|---|
| శతముఖి | 6-7 | 8.0 | 45×30 |
| కె.సి.యస్.-2 | 8 | 14.0 | 45×45 |
| కె.సి.యస్.-3 | 5 | 9.6 | 45×30 |
| ఆర్.యన్.సి.ఎ.-1 | 6 | 8.0 | 45×30 |

**శతముఖి:** ఇది ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం నుండి విడుదలయిన రకం. మొక్కలు గుబురుగా పెరిగి, తల్లి దుంప నుండి పిల్ల కొమ్ములు బాగా వస్తాయి.

**భావపురి: పంట కాలం :** 8 నెలలు, దిగుబడి 14.0 ట/ ఎ.

**కె.సి.యస్.-3 : పంటకాలం :** 5 నెలలు, దిగుబడి 9.6 ట /ఎ.

**విత్తన మోతాదు:** ఎకరాకు 300-400 కిలోలు విత్తనంగా తల్లిదుంపలు వాడితే దిగుబడి పెరుగుతుంది.

**విత్తన శుద్ధి:** విత్తన దుంపలను 10 లీటర్ల నీటికి 50 గ్రా. కాపర్ ఆక్సీక్లోరైడ్ మరియు 2.5 మి.లీ. మోనోక్రోటోఫాస్ కలిపిన ద్రావణంలో 15 నిమిషాలు ముంచి తీసి నీడలో ఆరబెట్టి వెంటనే నాటుకోవాలి.

**ఎరువులు:** ఎకరాకు 10 టన్నుల చివికిన పశువుల ఎరువు, 24 కిలోల భాస్వరం, 48 కిలోల నత్రజని, 32 కిలోల పొటాష్‌నిచ్చే ఎరువులు వేయాలి. పశువుల ఎరువు మరియు భాస్వరపు ఎరువును (సింగిల్ సూపర్‌ఫాస్ఫేటు రూపంలో) పూర్తిగా ఆఖరి దుక్కిలో వేసి కలియ దున్నాలి. నత్రజని, పొటాష్ ఎరువులను యూరియా, మ్యూరేట్ ఆఫ్ పొటాష్ రూపంలో, మూడు సమభాగాలుగా చేసి దుంప మొలకెత్తిన తర్వాత 30,60,90 రోజులలో వేయాలి. ఎరువులను మొక్క రెండు వైపుల గుంటల్లో వేసి మట్టితో కప్పి, తేలికపాటి తడిపెట్టాలి.

**అంతరకృషి:** మొదటిదఫా తడిపెట్టిన తర్వాత తేమ ఉన్నపుడు ఎకరాకు 2.0 లీ. బ్యూటాక్లోర్ లేదా 1.3 లీ. పెండిమిథాలిన్ 30% లేదా 200 మి.లీ. ఆక్సీఫ్లోరోఫిన్ 22.5శాతంలలో ఏదో ఒక దానిని 200 లీ. నీటిలో కలపి భూమిపై పిచికారీ చేయాలి. 40-45 రోజుల తర్వాత పలుచగా మొలిచిన కలుపును కూలీలతో తీయించాలి.

**అంతర పంటలు:**

కొబ్బరి, అరటి తోటలలో చేమదుంపను అంతర పంటగా వేయవచ్చును. స్వల్పకాలిక పంటలయిన ఫ్రెంచి చిక్కుడు, ముల్లంగి పంటలను చేమదుంప పొలంలో అంతర పంటగా (మొదటి రెండు నెలలు) వేసుకోవచ్చు.

**పంటకోత:** పంట పక్వదశలో ఆకులు పసుపుపచ్చగా మారి ఎండిపోతాయి. పిక్‌యాక్స్‌లను ఉపయోగించి కూలీలతో దుంపలను తవ్వించి తీయించవచ్చు. లేదా నాగలితో దున్ని తీయవచ్చు. పిల్ల దుంపలను తల్లి దుంపలనుండి వేరు చేసి, వేర్లను, మట్టిని తీసి శుభ్రపరచి వరిగడ్డి కప్పి ఉంచాలి.

ఒక వేళ దుంప త్రవ్వటం 15 రోజులు లేదా ఇంకా ఎక్కువ ఆలస్యం అయితే తేలికపాటి నీటి తడి యివ్వాలి. ఇందువలన దుంపలు బరువు కోల్పోవు.

**కోత అనంతరం జాగ్రత్తలు:**

తవ్వి తీసిన దుంపలను శుభ్రపరిచాక నీడలో ఉంచాలి. ఈ దుంపలను వరిగడ్డితో కప్పి, నీరు చల్లుతూ ఉండాలి. అందువలన దుంపలు బరువును కోల్పోవు.

**మార్కెటింగ్:**

దుంపలను తీసిన వెంటనే మార్కెట్‌కి పంపాలి. లేకుంటే, దుంప బరువు తగ్గి రైతుకు నష్టం వాటిల్లుతుంది. దుంపలను దఫ దఫాలుగా తవ్వి మార్కెట్‌కి పంపినచో రైతుకు మంచి ధర పలుకుతుంది.

**సస్యరక్షణ:**

**పొగాకు లద్దెపురుగు:** పంటపై ఆశించి ఆకులను పూర్తిగా తినివేసి నష్టాన్ని కలుగజేస్తుంది. పొగాకులద్దె పురుగు నివారణకు సమగ్ర సస్యరక్షణ చర్యలను పాటించాలి. ఎకరాకు 4 చొప్పున లింగాకర్షక బుట్టలు పెట్టాలి. 250 లార్వాలకు సమానమైన యన్.పి.వి. వైరస్ ద్రావణం వారానికి ఒకసారి చొప్పున 4 వారాలు పిచికారీ చేయాలి. సాలులో అక్కడక్కడ ఆముదపు మొక్కలు వేసి వాటిపై ఉన్న గుడ్ల సంచులను ఏరి నాశనం చెయ్యాలి. పురుగు తొలి దశలలో క్వినాల్‌ఫాస్ 2 మి.లీ. లేదా ప్రొఫెనోఫాస్ 2 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. పురుగు చివరి దశలలో విషపు ఎరలను పెట్టాలి. దీని కొరకు 5 కిలోల తవుడు+1 కిలో బెల్లం+500 గ్రా. మిథోమిల్ తగినంత నీటికి కలిపి వుండలుగా చేసి సాయంత్రం వేళల్లో పొలంలో పెట్టాలి.

**నల్లి:** ఆకుల అడుగుభాగాన గుంపులుగా చేరి రసాన్ని పీల్చటం వలన, పత్రహరితాన్ని కోల్పోయి ఆకులు రాలిపోతాయి. త్వరగా ఎండిపోతాయి. దీని నివారణకు ఫాసలోన్ 2.0 మి.లీ. నీటిలో కరిగే గంధకం పైనా క్రింద తడిసేలా పిచికారీ చేయాలి.

**ఆకుమచ్చ తెగులు:** వర్షాకాలంలో గాలిలో తేమ ఎక్కువగా వున్నప్పుడు ఈ తెగులు త్వరగా వృద్ధిచెంది ఆకులు కుళ్ళి ఎండిపోతాయి. ఆకు తొడిమలపై వస్తే ఆకుపూర్తిగా మాడిపోతుంది. లీటరు నీటికి 2.5 గ్రా. మాంకోజెబ్ లేదా డైమిథోమార్ఫ్+మాంకోజెబ్ కలిపిన మందును లీటరు నీటికి 2 గ్రా. చొప్పున కలిపి 10 రోజుల వ్యవధితో రెండుసార్లు పిచికారీ చేసి ఈ తెగులును అరికట్టవచ్చు.

చేమగడ్డ సాగుపై మరిన్ని వివరాలకు సంప్రదించవలసిన చిరునామా
**సీనియర్ సైంటిస్ట్ (హార్టికల్చర్) మరియు హెడ్, కూరగాయల పరిశోధనా స్థానం,**
రాజేంద్రనగర్, హైదరాబాద్. ఫోన్: 040-24018016